అమలాపురానికి మరో బైపాస్ రోడ్డు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం జిల్లా కేంద్రం అయ్యాక అంతకంతకూ పెరుగుతున్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మూడు బైపాస్ రోడ్లను అందుబాటులోకి తేగా మరో రెండు బైపాస్ రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. దీని వల్ల పట్టణంపై ట్రాఫిక్ భారం భారీగా తగ్గనుంది. ఇప్పటికే ఈదరపల్లి వంతెన నుంచి నల్ల వంతెన వరకూ ఉన్న ప్రధాన బైపాస్ రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయించడంతో ట్రాఫిక్ అవస్థలు తగ్గాయి. ఎనిమిది నెలల క్రితం రూ.కోటితో నల్ల వంతెను నుంచి నడిపూడి రోడ్డు వరకూ మరో బైపాస్, ఏడాదిన్నర క్రితం శ్రీనివాస్ ఏటిగట్టు నుంచి ఈదరపల్లి శివాలయం రోడ్డు వరకూ మరో బైపాస్ పూర్తి చేశారు. ఈదరపల్లి బైపాస్ రోడ్డుకు అనుబంధంగా ఉన్న నల్లవంతెన నుంచి ఎర్రవంతెన వరకూ ఉన్న రోడ్డును మరమ్మతులు చేయడమూ కలిసొచ్చింది.

ఇప్పటికే ఉన్న బైపాస్‌లకు తోడు నల్లవంతెన నుంచి ప్రధాన పంట కాల్వ వెంబడి నడిపూడి మీదుగా ఈదరపల్లి–ముక్కామల ప్రధాన బైపాస్ రోడ్డుకు అనుసంధానం చేశారు. తాజాగా పట్టణం మెయిన్ రోడ్డులో చిన్న వంతెనల వద్ద నుంచి కుమ్మరి కాల్వ గట్టు (ఈడబ్ల్యూఎస్ కాలనీ వైపు) మరో బైపాస్ రోడ్డుగా రూ.1.60 కోట్లతో బీటీ రోడ్డు నిర్మితమవుతోంది. ఆ బైపాస్ రోడ్డు కూడా ఈదరపల్లి నుంచి నల్లవంతెన వరకూ గల ప్రధాన బైపాస్ రోడ్డుకు అనుసంధానం కానుంది. ఈ రోడ్డును కలుపుతూ శ్మశానం నుంచి ఈదరపల్లి బైపాస్ రోడ్డు వరకూ దాదాపు 800 మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. మొత్తం ఈ రోడ్డును రూ.1.60 కోట్లతో నిర్మించేందుకు మున్సిపాలిటీ ఇంజినీరింగ్ శాఖ ఇప్పటికే 30 శాతం బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేసింది. ఇది కాకుండా ఇదే చిన్న వంతెనల వద్ద కుమ్మరి కాల్వ మరో ఏటిగట్టు (శ్రీనివాస ఏటిగట్టు) నుంచి ఈదరపల్లి శివాలయం రోడ్డుకు రూ.18 లక్షలతో మరో బీటీ రోడ్డు నిర్మితమైంది. ఇది శివాలయం రోడ్డు నుంచి జిల్లా కలెక్టర్ బంగ్లా, కొంకాపల్లి మీదుగా 216 జాతీయ రహదారిలోకి వెళ్లేందుకు వీలుగా మరో బైపాస్ రోడ్డులో అంతర్భాగంగా శ్రీనివాస ఏటిగట్టు బీటీ రోడ్డు భాగస్వామ్యం అవుతోంది. అలాగే శ్రీనివాస ఏటిగట్టుకు ఎదురుగా కుమ్మరి కాల్వ ఏటిగట్టును (సీతాపతిరావుపేట ఏటిగట్టు) కూడా మరో బైపాస్ రోడ్డుగా రూ.38 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డులో మరో 700 మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించి ఈదరపల్లి బైపాస్ రోడ్డుకు అనుసంధానం చేస్తే పట్టణానికి అయిదు బైపాస్ రోడ్లు అందుబాటులోకి వచ్చినట్లు అవుతుంది. ఈదరపల్లి–నల్లవంతెన, నల్లవంతెన– నడిపూడి, శ్రీనివాస ఏటిగట్టు– ఈదరపల్లి గ్రామ (గణపతి థియేటర్ పక్క నుంచి) బైపాస్ రోడ్లు పూర్తయితే ఇక చిన్న వంతెనల నుంచి ఈడబ్ల్యూఎస్ కాలనీ కుమ్మరి కాల్వ గట్టు, సీతాపతిరావు కుమ్మరి కాల్వ ఏటిగట్టు మీదుగా రెండు బైపాస్ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మితం కావాల్సి ఉంది.


అమలాపురం చిన్న వంతెనల నుంచి నిర్మిస్తున్న అదనపు బైపాస్ రోడ్డు

విశ్వరూప్ బైపాస్‌తో ప్రయోజనాలెన్నో



చిన్న వంతెన నుంచి ఈడబ్ల్యూఎస్ కాలనీ మీదుగా కుమ్మరికాల్వ ఏటిగట్టు వెంబడి నిర్మిస్తున్న విశ్వరూప్ బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఈదరపల్లి బైపాస్ రోడ్డుకు వెళ్లాలంటే మెయిన్ రోడ్డులో కలశం సెంటరు, ఆర్టీసీ బస్ స్టేషన్ రోడ్డు నుంచి ప్రధాన బైపాస్‌లోకి వెళ్లనవసరం లేకుండా అతి దగ్గర తోవ కానుంది. ఈ రోడ్డు వల్ల మెయిన్ రోడ్డు, గడియారం స్తంభం రోడ్డు తదితర రోడ్లపై సైతం ట్రాఫిక్ భారం తగ్గనుంది.

– బండారు గోవింద్, కౌన్సిలర్, 27వ వార్డు, అమలాపురం

విశ్వరూప్ బైపాస్ రోడ్డుగా నామకరణం

రూ.1.60 కోట్లతో చిన్న వంతెనల నుంచి ఈదరపల్లి బైపాస్ రోడ్డుకు నిర్మించే కొత్త బైపాస్ రోడ్డుకు పినిపే విశ్వరూప్ బైపాస్ రోడ్డుగా నామకరణం చేశారు. మున్సిపల్ డీఈఈ నాగ సతీష్, ఏఈలు ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం వేగవంతం చేస్తూ పనులు పర్యవేక్షిస్తున్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు పందిరి రాట ముహూర్తం


పందిరి రాట ముహూర్తాన్ని నిర్వహిస్తున్న ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి, ధర్మకర్తలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుడుతూ ఆలయ ప్రాంగణంలో పందిరి రాట ముహూర్తాన్ని ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి ముహూర్తపు రాట పాతారు. వచ్చే నెల 15 నుంచి 25వ తేదీ వరకూ 12 రోజుల పాటు కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ దూనబోయిన సాయిబాబు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లను తమ ధర్మకర్తల మండలి ఇప్పటి నుంచే పర్యవేక్షిస్తున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి అన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ యువజన విభాగం కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు యెండూరి రాఘవ, నడింపల్లి వర్మ, కాపునాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్నికుల క్షత్రియ సంఘ అధ్యక్షుడిగా శివ



అల్లవరం: కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన తారాడి శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమలాపురంలో కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సంఘ గౌరవాధ్యక్షుడు కర్రి స్వామినాథ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అగ్నికుల క్షత్రియులను ఒకే తాటిపైకి తెచ్చి సంఘ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శివను పలువురు అభినందించారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు


ఆర్‌సీఎం చర్చిలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం

యానాం: నియోజకవర్గంలోని పలు చర్చిల్లో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం క్రైస్తవులు, చిన్నారులు ఈత చెట్టు మట్టలను చేతబట్టి వాటిని రకరకాల పూలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. జెరూసలెంలోకి ఏసుక్రీస్తు ప్రవేశించినందుకు గుర్తుగా వేడుక జరిపారు. ఈ సందర్భంగా స్థానిక పురాతన రోమన్ కేథలిక్ చర్చిలో పాదర్ మరియదాసు పర్యవేక్షణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 50 మంది రక్తదానం చేశారు. కురసాంపేట రివైవల్ చర్చి, అంబేడ్కర్ నగర్ బాప్టిస్టు చర్చి, మెట్టకూరు మదర్ సుశీలమ్మ మెమోరియల్ చర్చి, దరియాలతిప్ప, పరంపేట తదితర చర్చిల్లో మట్టల ఆదివారం వేడుకలు జరిగాయి.

ఐదు మద్యం సీసాల స్వాధీనం

అల్లవరం: కారులో అక్రమంగా తరలిస్తున్న ఐదు మద్యం సీసాలను ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. నలుగురు ప్రయాణికులు కారుని వేగంగా నడుపుకుంటూ ఓడలరేవు వైపుగా వెళుతుండగా అల్లవరం ప్రధాన సెంటర్‌లో కారుని అడ్డుకుని తనిఖీ చేసి ఐదు మద్యం సీసాలను పట్టుకున్నామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఏడుకొండలు ఘటనపై అల్లవరం పోలీస్‌స్టేషన్లో రిపోర్టు అందించారు.

మద్య రహిత సమాజం కోసం ఓటు వేయండి

అమలాపురం రూరల్: రానున్న ఎన్నికల్లో మద్య రహిత సమాజం కోసం ప్రజలు మద్యపాన నిషేధానికి కట్టుబడి ఉండే రాజకీయ పార్టీలకు ఓట్లు వేయాలని మద్యపాన వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డాక్టర్ ఎం.సూర్యనారాయణ అన్నారు. అమలాపురంలో వివిధ పార్కుల్లో మద్యపానానికి వ్యతిరేకంగా బ్రోచర్లు పంచారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పెయ్యల దుర్గాప్రసాద్, కారెం వెంకటేశ్వరరావు, కె.సత్యశ్రీధర్, వై.శ్రీనివాస్, పరమట రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ ఆలయం వద్ద రద్దీ

సఖినేటిపల్లి: మెండుపాలెంలో ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి, భక్తి శ్రద్ధలతో కొలిచారు. వచ్చే నెల 8 వరకూ మహోత్సవాలు జరుగుతాయి.

కలసికట్టుగా పనిచేయాలి

సఖినేటిపల్లి: కాంగ్రెస్ పార్టీ టిక్కట్టు అధిష్టానం ఎవరికీ ఇచ్చినా అందరూ కలిసికట్టుగా విజయానికి కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రరాజు గోపాలకృష్ణంరాజు అన్నారు. ఆదివారం అంతర్వేదిలో ఆయన మాట్లాడారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామంలో కామాడి సత్యవతి (58) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై మణికుమార్ ఆదివారం రాత్రి తెలియజేశారు. తాళ్లరేవు మండలం లక్ష్మీపతినగరం గ్రామానికి చెందిన సత్యవతి తన కుమార్తె వద్ద తూరంగి మహాలక్ష్మి నగర్‌లో ఉంటోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం మోతాదుకు మించి మాత్రలు వేసుకుంది. ఆ ప్రభావంతో గాబరా వచ్చి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. కుమార్తె కర్రి లోవలక్ష్మి ఫిర్యాదు మేరకు ఏఎస్సై భీష్మకుమార్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం

మామిడికుదురు: మామిడికుదురు జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1971–76 బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొని, ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎంపీపీ కుసుమ వనజకుమారి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, భజరంగ్‌లాల్ బియానీ, సజ్జాద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న చక్ర తీర్థం


గౌతమీ గోదావరిలో స్వామివారి చక్రస్నానం


చక్ర తీర్థానికి హాజరైన భక్తులు

గౌతమీ గోదావరిలో చక్ర స్నానం.. పోటెత్తిన భక్తజనం

యానాం: స్థానిక వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా చక్ర తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం అర్చకులు పెద్దింటి రఘురామ వినోదాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారిని ఊరేగింపుగా గౌతమీ గోదావరికి తీసుకొచ్చి చక్ర స్నానాన్ని ఆచరించారు. స్వామివారి రథయాత్ర తరువాత రోజు జరిగే చక్ర తీర్థానికి యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా బాలాలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. చక్ర తీర్థం పురస్కరించుకుని చిన్నాసెంటర్ నుంచి విష్ణాలయం వీధి వరకూ భక్తులతో కిక్కిరిసిపోయింది. స్థానిక పోలీసులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాకినాడ నుంచి వచ్చే వాహనాలను పాతబస్టాండ్ నుంచి మళ్లించారు.

వైభవంగా తెప్పతెన్నాల ఉత్సవం

స్వామివారి కల్యాణోత్సవాల్లో చక్రతీర్థం రోజున తెప్పతెన్నాల ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేసిన దేదీప్యమైన విద్యుత్ వెలుగులతో కూడిన హంసావాహనంలో స్వామివారిని ఉంచి గౌతమీ గోదావరిలో విహరింపజేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి చంద్ర వాహనోత్సవాన్ని నిర్వహించారు. చంద్రవాహనంపై స్వామివారిని అధిరోహించి పురవీధుల్లో ఊరేగించారు. మద్దింశెట్టి సత్తిరాజు కుమారుడు డాక్టర్ ఎంవీఎస్‌ప్రసాద్ కుటుంబసభ్యులు ఉత్సవదారులుగా చంద్ర వాహనోత్సవాన్ని నిర్వహించారు.

వెంకన్న ఆలయానికి శంకుస్థాపన


వేంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన పూజల్లో పాల్గొన్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో శ్రీనివాస బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ అర్చకులు లక్ష్మీగణపతి పూజ, సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ హాజరై స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, సర్పంచ్ పెనుమాల సునీత, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కామిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు అంకం హిమభారతి, గుత్తుల జానకీ లక్ష్మి, దంగేటి బుల్లబ్బులు, కాలేపు భీమేశ్వరరావు, చింతపట్ల కృష్ణ రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ రాయితీ

అమలాపురం టౌన్: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్నును ఈ నెల 31వ తేదీలోగా చెల్లిస్తే దానిపై వడ్డీ మాఫీ చేస్తామని, ఈ అవకాశాన్ని పట్టణంలోని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వడ్డీ రాయితీపై కమిషనర్ మనోహర్ ఆదివారం స్వయంగా పట్టణంలోని కొందరు పన్ను చెల్లింపుదారుల ఇళ్లకు, సంస్థల వద్దకు రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళ్లి అవగాహన కల్పించారు. పన్నులు చెల్లించి రాయితీ పొందేందుకు ఇక 7 రోజులే గడువుందని సూచించారు. ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, కుళాయి చార్జీలు మొత్తం చెల్లించి వడ్డీ రాయితీ పొందడంతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పలు ప్రైవేటు విద్యాలయాలు, ఆస్పత్రుల యాజమాన్యాలు, కొన్ని ఇళ్ల యాజమానులను కమిషనర్ మనోహర్ కలిసి రెవెన్యూ సిబ్బందితో పన్నులు వసూలు చేశారు. దీంతో ఆదివారం ఒక్క రోజే రూ.8 లక్షల మేర పన్ను వసూలైంది. ఇప్పటిదాకా వడ్డీ మాఫీని పట్టణంలోని పన్నుల చెల్లింపుదారులు 70 శాతం సద్వినియోగం చేసుకున్నారు. రానున్న 7 రోజుల్లో నూరు శాతం పన్నులను వసూలు చేస్తామన్న ఆశాభావాన్ని మున్సిపల్ రెవెన్యూ అధికారి(ఆర్వో) శిరిగినీడి శివాజీ వ్యక్తం చేశారు.


వడ్డీ మాఫీపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఆర్వో శివాజీ

ఎన్నికల సలహా కమిటీ సమావేశం

యానాం: పుదుచ్చేరి స్టేట్ కాంగ్రెస్ ఎలక్షన్ అడ్వయిజరీ కమిటీ సమావేశం సిటింగ్ ఎంపీ, ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థి వి.వైథిలింగం అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలు, మేనిఫెస్టో తదితర విషయాలను చర్చించారు. కార్యక్రమంలో మాజీ సీఎం నారాయణసామి, మాజీమంత్రి కందసామి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవికి రాజీనామా చేయాలి

ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి అభ్యర్థిగా పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న హోం మంత్రి నమశ్శివాయం తన పదవికి రాజీనామా చేసి బరిలో నిలవాలని ఏఐడీఎంకే కార్యదర్శి ఎ.అన్బళగన్ ఆదివారం డిమాండ్ చేశారు. పుదుచ్చేరికి కాంగ్రెస్ హయాంలో, బీజేపీ హయాంలో సైతం స్టేట్‌హుడ్ ఇవ్వలేకపోయారన్నారు. కేంద్రపాలిత ప్రాంతాలు చాలావరకూ కేంద్ర ఆర్థిక కమిషన్ పరిధిలో ఉన్నా పుదుచ్చేరిని మాత్రం చేర్చలేదని దీనిపై 40 ఏళ్లుగా అసెంబ్లీలో తీర్మానం చేస్తున్నా కేంద్రంలో అధికార బీజేపీ పట్టించుకోలేదని ఆరోపించారు.

అలరించిన శ్రీనివాస కల్యాణం నాటకం


శ్రీనివాస కల్యాణం నాటకంలో ఓ ఘట్టం

యానాం: పట్టణంలోని భూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నియోజకవర్గ పరిధిలోని కనకాలపేటకు చెందిన షిరిడీ సాయి నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం పౌరాణిక నాటకం ఆద్యంతం ఆహూతులను అలరించింది. స్థానిక మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో పుదుచ్చేరి కళలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నంది అవార్డు గ్రహీత ఉమా శంకర్ దర్శకత్వంలో ప్రముఖ నాట్య కళాకారుడు కోన అప్పారావు మాస్టారు సమర్పణలో నాటకాన్ని ప్రదర్శించారు. నాటకంలో కోన అప్పారావు, జక్కపు సత్తిబాబు, హంసాని రామలక్ష్మణుడు, దంగుడుబియ్యం కృష్ణ, మల్లిపూడి సత్తిబాబు, పంతాడి సత్తిబాబు తదితరులు నటించారు.

లక్కవరం విద్యార్థిని సౌమ్య ప్రతిభ


సౌమ్యను అభినందిస్తున్న అధ్యాపకులు

మలికిపురం: ఇంటర్మీడియెట్ ఫస్టియర్ విద్యార్థిని లక్కవరం గ్రామానికి చెందిన వలవల సౌమ్య, ఒడిషాలోని బాలాసోర్ ఫకీర్ మోహన్ విశ్వ విద్యాలయంలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో విశేష ప్రతిభ కనబరిచింది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరఫున ఈ నెల 16 నుండి 22 వరకు శిబిరంలో పాల్గొని, అక్కడ ఆంధ్రప్రదేశ్ చరిత్ర విభాగంలో ప్రదర్శన ఇచ్చి, అక్కడి గవర్నర్ రఘుబార్‌దాస్ ప్రసంశలు అందుకుంది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరఫున ఎంపికైన ఎనిమిది మందిలో సౌమ్య ఉందని స్థానిక కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఏబీ నాయుడు తెలిపారు. ఆదివారం కళాశాలలో ఆమెకు అభినందన కార్యక్రమం జరిగింది.

బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా రాజశేఖర్


నూతన అధ్యక్షుడు రాజశేఖర్‌ను అభినందిస్తున్న కార్యవర్గ సభ్యులు

అమలాపురం రూరల్: జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నూతన అధ్యక్షుడిగా దడాల రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పేరూరు వెంకటకృష్టాపురంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం ఉపాధ్యక్షుడు మట్టా వెంకట్రావు అధ్యక్షతన అదివారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన మట్టా సిద్దార్థ గౌతమ్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో 21 నెలల కాలానికి రాజశేఖర్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను ఎస్ఎస్ భూపతి, మట్టా వెంకట్రావు, పెనుమాల సుధీర్, దడాల రామకృష్ణ, పచ్చిమాల బాబ్జి, జేవీవీ సత్యనారాయణ, కేవీ రమణ, ధనరాజు, మాగాపు ఈశ్వరరావు తదితరులు అభినందించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

అమలాపురం టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పట్టణ సీఐ క్రిస్టోఫర్ ఆదివారం పరిశీలించారు. ఎలాంటి వివాదాలకు, సమస్యలకు తావు లేకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు సహకరించాలని డీఎస్పీ మహేశ్వరరావు ప్రజలను కోరారు. పట్టణంలోని మద్దాలవారిపేట, నారాయణపేట, రూరల్ మండలంలోని రోళ్లపాలెం, తొట్లపాలెంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ, సీఐలు సందర్శించి ఆయా వార్డులు, పంచాయతీల అధికారులతో మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసిన భవనాలను పరిశీలించి పోలీసు బందోబస్తు, తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు.


సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మహేశ్వరరావు, పట్టణ సీఐ క్రిస్టోఫర్

మిథున్‌రెడ్డి పర్యటన విజయవంతం చేయండి : గొల్లపల్లి

రాజోలు: రాజోలు నియోజకవర్గంలో ఈ నెల 26న జరిగే ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన తాటిపాక మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన రాజోలు మండల పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. చాకలిపాలెం బాలాజీ ఫంక్షన్ హాలులో ఈ నెల 26న పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో విజయ శంఖారావం పూరించేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారన్నారు. అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుతో పాటు, నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు సమావేశానికి హాజరవుతారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ గెద్దాడ సత్యనారాయణ, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, మాజీ ఎంపీటీసీ మెడబల రాజ్‌కుమార్, మద్దుల కాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రావులపాలెం: వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం స్థానిక అలివేలు మంగా పద్మావతి ఆండాల్ సహిత వేంకటేశ్వర స్వామివారికి పుత్రకామేష్ఠి హోమం ఘనంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయానే సుప్రభాత సేవ, సహస్ర నామార్చనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి గోవింద మాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథ్ ఆచార్యులు ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు జరిపారు. రాత్రికి స్వామివారికి అశ్వ వాహనోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వామి వారి సేవలో ఎమ్మెల్యే

గ్రామంలో ఉన్న అలివేలు మంగా పద్మావతీ ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం జరిగిన రథోత్సవంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. స్వామి వారి రథాన్ని లాగారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సర్ప వాహనంపై స్వామి ఊరేగింపు

మామిడికుదురు: మాకనపాలెంలో ఉన్న అనంత లక్ష్మి, భూదేవి సమేత సత్యనారాయణస్వామి వారి 72వ దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం సర్ప వాహనంపై స్వామి వారు విహరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల ఆనందోత్సాహాల నడుమ గ్రామోత్సవం జరిగింది.

దేశంలో ఎక్కడా లేనట్టుగా రాష్ట్రాభివృద్ధి

వైఎస్సార్ సీపీ పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి విప్పర్తి

పి.గన్నవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రం అభివృద్ధి చెందిందని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ముంగండపాలెం, గాజులగుంటలో ఆదివారం ఆయన ప్రజలను కలుసుకుని మాట్లాడారు. జగన్ పాలనలో జరిగిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో తమకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు, నాయకులు నాగాబత్తుల సూర్యనారాయణ, కుడుపూడి నాగార్జున, దేశిరాజు సీతారామయ్య, యాండ్ర ఏసునాగేశ్వరరావు, మట్టపర్తి సూర్యనారాయణ, ఉందుర్తి ఏసుబాబు, కొక్కిరి రవికుమార్, అడ్డగళ్ల శ్రీను, విప్పర్తి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామభక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద పార్టీ నేతలతో విప్పర్తి వేణుగోపాలరావు

భక్తాంజనేయ స్వామికి పూజలు

ముంగండపాలెం శివారు గాజులగుంట బ్రిడ్జి వద్ద నిర్మించిన ఆలయంలో శ్రీరామ భక్తాంజనేయ స్వామివారి విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు.